సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
శుక్రవారం : 21 : జూలై : 2023



ఎన్‌క్వాస్.. ఎంతెంత దూరం?!
భద్రాచలం ఏరియా ఆస్పత్రికి ఎన్‌క్వాస్ గుర్తింపుపై ఉత్కంఠ నెలకొంది. తొలిసారి 2018లో అవార్డు వచ్చింది. 10లో



కలెక్టర్‌ను కలిసిన అధికారులు
కలెక్టర్ ప్రియాంకను సింగరేణి డైరెక్టర్ సత్యనారాయణరావు, జీఎం షాలేమురాజు మర్యాదపూర్వకంగా కలిశారు. 10లో

గరిష్టం / కనిష్టం
28° / 25°
వాతావరణం
జిల్లాలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక గురువారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోప వీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పెద్దమ్మతల్లికి సువర్ణ పుష్పార్చన



అమ్మవారికి పుష్పార్చన చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్ : మండల పరిధిలో కొలువుదీరిన శ్రీపెద్దమ్మతల్లి అమ్మవారికి గురువారం 108 సువర్ణ పుష్పాలతో వైభవంగా అర్చన నిర్వహించారు. అనంతరం మంత్రపుష్పం, నివేదన, హారతి సమర్పించారు. కార్యక్రమంలో అర్చకులు పద్మనాభశర్మ, రవికుమార్ శర్మ, ఆలయ కమిటీ చైర్మన్ మహిపతి రామలింగం తదితరులు పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాల వారు అప్రమత్తంగా ఉండాలి

కొత్తగూడెంటౌన్: ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ముంపు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ డాక్టర్ వినీత్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. భారీ వర్షాలతో గోదావరి నీటిమట్టం క్రమంగా పెరుగుతోందని, లోతట్టు ప్రాంతాల వారెవరూ భయాందోళనలకు గురి కావాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో అన్ని రకాల సహాయక చర్యలు తీసుకుంటున్నారని, బాధితులకు నిత్యం అందుబాటులో ఉంటారని భరోసా ఇచ్చారు. ఎవరికైనా ఆపద వస్తే వెంటనే డయల్ - 100కు ఫోన్ చేసి పోలీసుల సహాయం తీసుకోవచ్చని తెలిపారు.

కాంగ్రెస్ ఎన్నికల కమిటీలో జిల్లా నేతలు

ఖమ్మంసహకారనగర్: రానున్న సార్వత్రిక ఎన్నికల కోసం కాంగ్రెస్ పార్టీ కమిటీని నియమించింది. 26మందితో కూడిన ఈ కమిటీ వివరాలను గురువారం ఏఐసీసీ ప్రకటించింది. కమిటీ చైర్మన్‌గా టీ పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి వ్యవహరించనుండగా, మిగిలిన వారు సభ్యులుగా ఉన్నారు. ఇందులో ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన నలుగురు సీనియర్ నాయకులకు చోటు కల్పించారు. సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క, కేంద్ర మాజీ మంత్రి రేణుకాచౌదరి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే పొదెం వీరయ్య, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి సభ్యులుగా ఉంటారు.

అదనపు కలెక్టర్‌గా డీఆర్డీఓకు బాధ్యతలు



మధుసూదన్‌రాజు

చుంచుపల్లి: స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా ఇన్‌చార్జ్ బాధ్యతలను డీఆర్‌డీఓ జి.మధుసూదన్‌రాజుకు అప్పగిస్తూ కలెక్టర్ ప్రియాంక ఆల గురువారం అప్పగించారు. ఈ బాధ్యతలకు ఇటీవలి వరకు కలెక్టర్ అనుదీప్ చూడగా, ఆయన బదిలీతో ప్రస్తుత కలెక్టర్ ప్రియాంక డీఆర్డీఓకు అప్పగించారు. మొదట జెడ్పీ సీఈఓగా పనిచేసిన మధుసూదన్‌రాజు 2020 నుంచి డీఆర్‌డీఓగా విధులు నిర్వర్తిస్తున్నారు.

నేడు పాఠశాలలకు సెలవు

కొత్తగూడెంఅర్బన్: ఎడతెరపిలేకుండా భారీవర్షాలు కురుస్తున్న నేపథ్యంలో శుక్రవారం కూడా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు సెలవు ప్రకటించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖరశర్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ప్రకటన తెలియకపోవడంతో గురువారం కొన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు పని చేశాయి. విషయం తెలుసుకున్న తర్వాత ఆయా యాజమాన్యాలు మధ్యాహ్నం విద్యార్థులను ఇళ్లకు పంపించారు.

ప్రమాద స్థాయిలో..



భద్రాచలం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి

భద్రాచలం వద్ద పెరుగుతున్న గోదావరి

- 43 అడుగులు దాటడంతో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ
- పునరావాస కేంద్రాలకు ముంపు బాధితులు
- నేడు మూడో ప్రమాద హెచ్చరిక స్థాయికి చేరుకునే అవకాశం
- సహాయక చర్యల పర్యవేక్షణకు నేడు మంత్రి పువ్వాడ రాక

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం/భద్రాచలం: తెలంగాణతో పాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌లలో కురుస్తున్న వర్షాలతో గోదావరికి వరద పోటెత్తుతోంది. దీంతో భద్రాచలం వద్ద గురువారం మధ్యాహ్నమే నీటి మట్టం 43 అడుగులకు చేరడంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. కలెక్టర్ ఎ.ప్రియాంక వరద తీవ్రత, సహాయక చర్యలను దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు.

పొంగి పొర్లుతున్న ఉపనదులు..
ఉప నదులైన ప్రాణహిత, ఇంద్రావతి పరీవాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో గోదావరికి వరద పెరుగుతోంది. మేడిగడ్డ లక్ష్మీ బ్యారేజీ నుంచి బుధవారం 5.20 లక్షల క్యూసెక్కులు, గురువారం మధ్యాహ్నం 6.20 లక్షల క్యూసెక్కుల గరిష్ట వరదను దిగువకు వదిలారు. దీనికి ఇంద్రావతి నుంచి వస్తున్న సుమారు నాలుగు లక్షల క్యూసెక్కుల జలప్రవాహం జతవుతోంది. దీంతో భద్రాచలం వద్ద నీటిమట్టం గంటగంటకూ పెరుగుతోంది. గురువారం అర్ధరాత్రి లేదా శుక్రవారం తెల్లవారుజాము వరకు రెండో ప్రమాద హెచ్చరిక స్థాయి అయిన 48 అడుగులకు చేరుకోవచ్చని అధికారుల అంచనా. ప్రవాహం ఇలాగే కొనసాగితే నేటి సాయంత్రానికి 53 అడుగులకు చేరి మూడో ప్రమాద హెచ్చరిక కూడా జారీ చేసే అవకాశం ఉంది.

అప్రమత్తంగా ఉంటేనే నష్ట నివారణ
గోదావరి నీటిమట్టం గతేడాది అత్యధికంగా 71.3 అడుగులకు చేరి బీభత్సం సృష్టించడంతో.. అధికారులు ఈ ఏడాది ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు. జూలై ప్రారంభంలోనే జిల్లా, డివిజన్ స్థాయి సమావేశాలు నిర్వహించి మండల, డివిజన్ స్థాయి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. మూడో ప్రమాద హెచ్చరిక దాటితే ఏజెన్సీలోని పలు గ్రామాలు ముంపునకు గురవుతాయి. భద్రాచలం నుంచి ఇతర మండలాలకు రాకపోకలు స్తంభిస్తాయి. ప్రధానంగా దుమ్ముగూడెం మండలం తూరుబాక, రేగుపల్లి, నడికుడి, గంగోలు, బైరాగులపాడు గ్రామాల వద్ద, చర్ల మండలం కుదునూరు, సుబ్బంపేట గ్రామాల వద్ద ప్రధాన రహదారులపైకి వరద నీరు చేరి రాకపోకలు నిలిచిపోతాయి. దీంతో భద్రాచలం నుంచి దుమ్ముగూడెం, చర్ల, వెంకటాపురం, వాజేడు, నెల్లిపాక, కూనవరం మండలాలకు సైతం పూర్తిగా రవాణా స్తంభిస్తుంది.

నేడు మంత్రి పువ్వాడ రాక

మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేస్తే లోతట్టు ప్రాంతాల ప్రజలను హుటాహుటిన పునరావాస కేంద్రాలకు తరలిస్తారు. శుక్రవారం ఆ స్థాయికి వరద వచ్చే అవకాశం ఉండటంతో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ భద్రాచలంలో మకాం వేయనున్నారు. వరద తగ్గుముఖం పట్టే వరకు ఆయన ఇక్కడే ఉంటారు. మంత్రితో పాటు ఇటీవల బదిలీపై వెళ్లిన కలెక్టర్ అనుదీప్ సైతం ప్రత్యేక సేవలు అందించేందుకు ఇక్కడికి వస్తున్నారు. గతేడాది 71 అడుగుల స్థాయికి వరద వచ్చినా, ప్రాణ నష్టం జరగకుండా వీరిద్దరూ పక్కా ప్రణాళికతో పని చేశారు. దీంతో ఈసారి వరద సహాయ కార్యక్రమాల కోసం మరోసారి భద్రాచలం వస్తున్నారు.

పునరావాస శిబిరాలు సిద్ధం
వరద తీవ్రత పెరిగితే బాధితులను తరలించేందుకు ముందుగానే పునరావాస కేంద్రాలు సిద్ధం చేశారు. మండలానికో ప్రత్యేక అధికారికి బాధ్యతలు అప్పగించడంతో పాటు కంట్రోల్ రూంలు ఏర్పాటు చేశారు. నిత్యావసర సరుకులకు ఇబ్బంది లేకుండా బఫర్ స్టాక్ ఉంచారు. ప్రజలను తరలించేందుకు ట్రాక్టర్లు, జేసీబీలు, లైఫ్ జాకెట్లు, పడవలను సిద్ధంగా ఉంచారు.

తాలిపేరుకు పోటెత్తిన వరద



తాలిపేరు నుంచి విడుదలవుతున్న వరదనీరు

చర్ల: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో తాలిపేరు ప్రాజెక్టులోకి వరదనీరు వచ్చి చేరుతోంది. దీంతో 25 గేట్లలో 24 గేట్లు పూర్తిగా ఎత్తి 1,02,399 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తున్నారు. ఈ నీరు తాలిపేరు వాగులోకి వస్తుండగా ఇరువైపులా ఉన్న ఆంజనేయపురం, గుంపన్నగూడెం, దండుపేట, తేగడ, ఎర్రగడ్డ తదితర గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకుంటున్నాయి. ప్రాజెక్ట్‌లోకి మరింతగా వరదనీరు వచ్చే అవకాశం ఉందని, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ప్రాజెక్ట్ ఈఈ రాంప్రసాద్, డీఈ తిరుపతి సూచించారు.

కిన్నెరసాని గేట్లు ఎత్తివేత



నిండుకుండలా కిన్నెరసాని జలాశయం

పాల్వంచ : మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో కిన్నెరసాని జలాశయానికి వరదనీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు సామర్థ్యం 407 అడుగులు కాగా, గురువారం నాటికి 401.50 అడుగులకు చేరింది. దీంతో రెండు గేట్లు ఎత్తి 10 వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేసినట్లు డ్యామ్‌సైడ్ పర్యవేక్షక ఇంజనీరు సురేష్ తెలిపారు. నీటి విడుదలతో రాజాపురం, యానంబైల్ గ్రామాల మధ్య చప్టాపై వరద నీరు ఉధృతంగా ప్రవహించి ఎగువన ఉన్న 24 గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి.

సింగరేణి ఆశలపై ‘నీళ్లు’

- ఎడతెరిపి లేని వర్షంతో బొగ్గు ఉత్పత్తికి బ్రేక్
- ఓసీ గనుల్లో గణనీయంగా తగ్గుదల
- సగానికి పడిపోయిన ప్రొడక్షన్
- అధికారుల్లో ఆందోళన



కొత్తగూడెం జీకే ఓసీలో నిలిచిన వర్షపు నీరు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: రాష్ట్ర వ్యాప్తంగా విస్తారంగా కురుస్తున్న వర్షాలతో సింగరేణిలో బొగ్గు ఉత్పత్తికి ఆటంకం కలుగుతోంది. ముఖ్యంగా నిర్దేశిత లక్ష్యానికి మించి ఉత్పత్తిని అందించే ఓపెన్ కాస్టు గనుల నుంచి బొగ్గుపెళ్లలు బయటకు రావడం కష్టంగా మారుతోంది. మరో రెండు రోజులు పాటు ముసురు ఉండొచ్చని వాతావరణ శాఖ ప్రకటించడంతో సింగరేణి అధికారుల్లో ఆందోళన మొదలైంది.

సగానికి పడిపోయింది..
గత నాలుగైదు రోజులుగా కురుస్తున్న వానలతో సింగరేణి వ్యాప్తంగా బొగ్గు ఉత్పత్తికి విఘాతం ఏర్పడింది. సంస్థ పరిధిలో ఉన్న 24 భూగర్భ గనుల ద్వారా రోజుకు 27 వేల టన్నుల బొగ్గు వెలికి తీయాల్సి ఉండగా ప్రస్తుతం 15వేల టన్నులకు మించడం లేదు. ఇక ఓపెన్‌కాస్ట్‌ల్లో రోజుకు 1.68 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి జరగాల్సి ఉంది. వర్షాలు లేకుంటే ఓసీల్లో 100 శాతానికి మించి ఉత్పత్తి సాధ్యం అవుతుంది. కానీ గత నాలుగైదు రోజులుగా వర్షాలతో ఓసీల్లో ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోయింది. జూలై 18న సింగరేణి వ్యాప్తంగా ఉన్న ఓపెన్ కాస్ట్ గనుల్లో బొగ్గు ఉత్పత్తి సామర్థ్యం 81 శాతం ఉండగా, జూలై 20 నాటికి అది 57 శాతానికి పడిపోయింది. అండర్ గ్రౌండ్, ఓపెన్ కాస్టు గనులు కలుపుకుని జూలై 18న 76 శాతం మేరకు ఉత్పత్తి సాధించగా 20వ తేదీన అది 57 శాతానికే పరిమితమైంది.

మరో వారం రోజులు..
వర్షాలు తగ్గిన వెంటనే ఓపెన్ కాస్టులు తెరపిన పడే పరిస్థితి కనిపించడం లేదు. గత మూడు నాలుగు రోజులుగా ఓసీల్లో బొగ్గును ఉత్పత్తి చేసే ప్రాంతాలు పూర్తిగా నీటితో నిండిపోయి ఉన్నాయి. ప్రస్తుతం ఉత్పత్తిగా చూపిస్తున్న బొగ్గు పని ప్రదేశం నుంచి పక్కకు తీసిందే. ఓసీల నుంచి తిరిగి బొగ్గును ఉత్పత్తి చేయాలంటే ముందుగా నీటిని తోడేయాలి. ఆ తర్వాత భారీ వాహనాలు తిరిగేందుకు వీలుగా రోడ్లను మార్చాలి. అప్పుడే ఓసీల నుంచి తిరిగి వంద శాతానికి మించి బొగ్గు ఉత్పత్తి సాధ్యం అవుతుంది. లేదంటే మరికొన్నాళ్లు సింగరేణికి గడ్డు పరిస్థితి తప్పదు. మరోవైపు బొగ్గు కోసం పారిశ్రామిక రంగం నుంచి సింగరేణిపై తీవ్ర ఒత్తిడి ఉంది. దీంతో ప్రస్తుతం కురుస్తున్న వానలు సింగరేణి అధికారులకు కంటి మీద కునుకులేకుండా చేస్తున్నాయి.

ప్రయోజనం లేని పర్యటన
వర్షాకాలంలో బొగ్గు ఉత్పత్తికి నష్టం రాకుండా ఎలాంటి చర్యలు అవలంబించాలనే అంశంపై సింగరేణి సంస్థ గతేడాది అధ్యయనం చేసింది. కార్పొరేట్ ప్రాజెక్ట్ ప్లానింగ్, ఆపరేషన్స్, ఎక్స్‌ప్లోరేషన్, జియాలజీ, సర్వే విభాగాలకు చెందిన ఉన్నతాధికారులతో కూడిన బృందం నార్తర్న్ కోల్‌ఫీల్డ్, వెస్టర్న్ కోల్‌ఫీల్డ్‌లను పరిశీలించింది. 2022 ఆగస్టులో 15 రోజుల పాటు ఈ బృందం అక్కడ పర్యటించింది. దీంతో ఈ ఏడాది వానాకాలంలో ప్రత్యేక కార్యాచరణ ఉంటుందని అంతా భావించారు. కానీ వాస్తవంలో అలాంటి పరిస్థితి కనిపించడం లేదు. దీంతో ఉన్నతాధికారులు చేపట్టిన పర్యటనతో ప్రయోజనం ఏంటని కార్మికులు ప్రశ్నిస్తున్నారు.

ఉత్పత్తికి ఆటంకం..

ఉత్తర తెలంగాణలోని ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, జయశంకర్ భూపాలపల్లి, పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల పరిధిలో సింగరేణి బొగ్గు గనులు విస్తరించి ఉన్నాయి. ఈ జిల్లాల్లోని 11 ఏరియాల పరిధిలో 24 భూగర్భ గనులు(యూజీ), 18 ఓపెన్ కాస్ట్ (ఓసీ) గనుల ద్వారా బొగ్గు ఉత్పత్తి జరుగుతోంది. గత 30 ఏళ్లుగా భూగర్భ గనులతో పోల్చితే ఉపరితల గనుల నుంచే బొగ్గు ఎక్కువగా బయటకు వస్తోంది. ప్రతీ ఏడాది భూగర్భ గనుల్లో కనాకష్టంగా 60 శాతమే ఉత్పత్తి సాధిస్తుండగా ఉపరితల గనుల నంచి ఇరవై శాతానికి పైగా అదనంగా బొగ్గును వెలికి తీస్తున్నారు. దీంతో యూజీలో తలెత్తిన లోటును ఉపరితల గనుల్లో వచ్చే అదనపు ఉత్పత్తి ద్వారా భర్తీ చేస్తున్నారు. అయితే ప్రతీ వర్షాకాలం ఓపెన్‌కాస్ట్ గనుల్లో ఉత్పత్తికి విఘాతం కలుగుతోంది. వాన చినుకులు కురిస్తే ఓపెన్‌కాస్ట్ గనుల్లోని నేల చిత్తడిగా మారుతుంది. బొగ్గు నిల్వలు ఉన్న ప్రాంతాల్లో భారీ ఎత్తున వర్షపు నీరు చేరుకుంటోంది. ఓసీ గనుల్లో జారుడు స్వభావం కలిగిన నేలపై భారీ యంత్రాలతో బొగ్గును వెలికి తీయడం, దాన్ని బయటకు రవాణా చేయడం కష్టంగా మారుతోంది. ఫలితంగా బొగ్గు ఉత్పత్తి తగ్గిపోతోంది.

గత మూడు రోజులుగా బొగ్గు ఉత్పత్తి వివరాలు (టన్నుల్లో)

		లక్ష్యం	సాధించింది	శాతం
జూలై 18	అండర్‌గ్రౌండ్	27,372	13,478	49
	ఓపెన్‌కాస్ట్	1,68,792	1,36,401	81
19	అండర్ గ్రౌండ్	27,372	15,039	55
	ఓపెన్ కాస్ట్	1,68,792	1,14,617	68
20	అండర్‌గ్రౌండ్	27,372	15,082	55
	ఓపెన్ కాస్ట్	1,68,792	97,029	57

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కలెక్టర్ ప్రియాంక ఆల



అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్

భద్రాచలం: గోదావరి వరద పెరుగుతున్నందున లోతట్టు ప్రాంత ప్రజలు, ముంపు కాలనీ వాసులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ప్రియాంక ఆల అన్నారు. గురువారం ఆమె భద్రాచలంలో పర్యటించి ముంపు ప్రభావిత కొత్త కాలనీని పరిశీలించారు. కాలనీ వాసులతో మాట్లాడి వరద రాక ముందే పునరావాస శిబిరాలకు వెళ్లాలని సూచించారు. వరద నీటిలో మునిగిపోయిన పది కుటుంబాల వారిని వెంటనే తరలించాలని అధికారులను ఆదేశించారు. శిబిరాల్లో అన్ని వసతులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గోదావరి పెరిగినా నష్టం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం విస్తా కాంప్లెక్స్ వద్ద ఉన్న పంపుహౌస్, కరకట్ట నుంచి గోదావరిని పరిశీలించారు. పట్టణంలో నీరు నిల్వకుండా చూడాలని, కొట్టుకొచ్చిన చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని ప్రత్యేకాధికారి నాగలక్ష్మి, పంచాయతీ ఈఓను ఆదేశించారు. కలెక్టర్ వెంట ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్డీఓ రత్నకళ్యాణి, ఇన్‌చార్జ్ తహసీల్దార్ రామకృష్ణ, ఇరిగేషన్ ఎస్‌ఈ వెంకటేశ్వరెడ్డి, ఏఈ వెంకటేష్ ఉన్నారు.

మున్సిపల్ కమిషనర్ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న కమిషనర్ స్వామి

పాల్వంచ : పాల్వంచ మున్సిపల్ కమిషనర్‌గా ఎ.స్వామి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడి కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్ తుర్కయాంజల్ మున్సిపాలిటీకి బదిలీ అయిన విషయం తెలిసిందే. మేడ్చల్ జిల్లా దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న స్వామి ఇక్కడికి వచ్చారు. ముందుగా ఆయన పెద్దమ్మగుడిలో పూజలు నిర్వహించారు. అనంతరం కార్యాలయానికి చేరుకోగా సిబ్బంది స్వాగతం పలికారు. బాధ్యతలు చేపట్టిన తర్వాత విలేకరులతో మాట్లాడుతూ.. అందరి సహకారంతో మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. శానిటేషన్, నీటి సరఫరా, వీధిలైట్లు సక్రమంగా ఉండేలా చూస్తామని చెప్పారు. కార్యక్రమంలో డీఈ మురళీ, ఏఈ రాజేశ్, టీపీఓ సత్యనారాయణ, మేనేజర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

2013లో ఉద్యోగంలోకి..
నల్లగొండ జిల్లా అడవి దేవులపల్లి మండలం ములకచర్ల గ్రామానికి చెందిన స్వామి 2013లో కమిషనర్‌గా ఉద్యోగంలో చేరారు. తొలుత మహబూబ్‌నగర్ జిల్లా కొల్లాపూర్ మున్సిపాలిటీలో, 2015 -16లో దేవరకొండ, 2016 నుంచి 2021 వరకు బోధన్, 2021 నుండి 2023 జూలై 19 వరకు దమ్మాయిగూడలో పనిచేసి బదిలీపై పాల్వంచ మున్సిపాలిటీకి వచ్చారు. ఆయన సతీమణి మున్సిపల్ శాఖలోనే హైదరాబాద్‌లో టౌన్ ప్లానింగ్ విభాగంలో విధులు నిర్వహిస్తున్నారు.

పారదర్శకంగా ఓటరు జాబితా రూపొందించాలి

సూపర్‌బజార్(కొత్తగూడెం): రానున్న ఎన్నికల కోసం తప్పుల్లేని, పారదర్శకమైన ఓటరు జాబితా తయారు చేయాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల అన్నారు. గురువారం కలెక్టరేట్ నుంచి ఆమె అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు చేసేప్పుడు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఇంటింటి సర్వేలో గుర్తించిన అర్హులందరికీ ఓటుహక్కు కల్పించేందుకు దరఖాస్తులను ఆన్‌లైన్ చేయాలన్నారు. ఫారం -6, 7, 8 ద్వారా నూతన ఓటరు నమోదు, ఓటరు జాబితాలో మార్పు, చేర్పులు, మరణించిన ఓటరు తొలగింపుల ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. బీఎల్ఓ యాప్‌లో ఓటరు వివరాల నమోదులో జాగ్రత్తలు పాటించాలన్నారు. ఓటర్లకు సమీపంలో పోలింగ్ కేంద్రాలు ఉండేలా రేషనలైజేషన్ చేసేందుకు నివేదికలు ఇవ్వాలని చెప్పారు. మరణించిన ఓటర్ల పేర్లు తొలగింపు సందర్భంగా విధిగా మరణ ధ్రువీకరణ పత్రంతో పాటు కుటుంబ సభ్యుల నుంచి లిఖిత పూర్వకంగా తీసుకోవాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో దివ్యాంగులు, వృద్ధుల కోసం ర్యాంపులు, మౌలిక సదుపాయాలు కల్పించాలని స్పష్టం చేశారు.

పునరావాస కేంద్రానికి తరలింపు

భద్రాచలంటౌన్: గోదావరి ముంపు బాధితులను గురువారం రాత్రి రెవెన్యూ అధికారులు పునరావాస కేంద్రానికి తరలించారు. పట్టణంలోని నన్నపనేని మోహన్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన శిబిరానికి కొత్తకాలనీకి చెందిన 20 కుటుంబాల వారిని చేరవేశారు. బాధితులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా విద్యుత్, తాగునీటితో పాటు ఆహార పదార్థాలను అధికారులు సమకూర్చారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు నర్సింహారావు, మంగీలాల్, వీఆర్ఏలు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

ఒక్క ప్రాణానికీ హాని కలగొద్దు



మాట్లాడుతున్న కృష్ణ ఆదిత్య, పక్కన గౌతమ్ పొట్రు, కలెక్టర్ ప్రియాంక, ఎస్పీ వినీత్ తదితరులు

ప్రత్యేకాధికారులు కృష్ణ ఆదిత్య, గౌతమ్ పొట్రు

భద్రాచలంఅర్బన్: గోదావరి వరద క్రమంగా పెరుగుతున్నందున భద్రాచలం వద్ద నీటిమట్టం పెరుగుతోందని, అధికారులు ముందు జాగ్రత్త చర్యలు పాటించి ఏ ఒక్క ప్రాణానికీ హాని కలగకుండా చూడాలని గోదావరి వరదల ప్రత్యేకాధికారులు కృష్ణ ఆదిత్య, గౌతమ్ పొట్రు అధికారులను ఆదేశించారు. ఐటీడీఏ సమావేశ మందిరంలో గురువారం రాత్రి కలెక్టర్ ప్రియాంక, ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్, ఎస్పీ వినీత్, భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్ తదితరులతో కలిసి వారు సమీక్ష సమావేశం నిర్వహించారు. వరద ఉధృతితో ముంపు ప్రాంతాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. అత్యధికంగా వరద ముంపునకు గురయ్యే దుమ్ముగూడెం, అశ్వాపురం మండలాలకు రెండు ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలను పంపిస్తున్నామని, సమస్యాత్మక గ్రామాల ప్రజలను వెంటనే పునరావాస కేంద్రాలకు తరలించాలని సూచించారు. అధికారులంతా సిబ్బందితో కలిసి భద్రాచలంలోనే అందుబాటులో ఉండాలని చెప్పారు. గ్రామాల్లో ఏమైనా సమస్యలుంటే వెంటనే కంట్రోల్ రూమ్‌ల్లో ఏర్పాటు చేసిన ఫోన్ నంబర్లకు వాట్సాప్ ద్వారా తెలియజేయాలని అన్నారు. విస్తా కాంప్లెక్స్, కొత్త కాలనీల వారి పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. పునరావాస కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలని, పిల్లలకు స్నాక్స్, బిస్కెట్లు ఇవ్వాలని, తగినన్ని మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు. సివిల్ సప్లై ద్వారా బియ్యం సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని, విద్యుత్, తాగునీటి సరఫరా సక్రమంగా ఉండాలని చెప్పారు. ఏమైనా లోపాలున్నట్టు తమ దృష్టికి వస్తే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ముంపు ప్రాంతాల్లో గర్భిణులను గుర్తించి ముందుగానే ప్రభుత్వ ఆస్పత్రులకు తరలించాలని చెప్పారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్డీఓ రత్న కళ్యాణి, ఇరిగేషన్ ఎస్ఈ వెంకటేశ్వర్లు, డీపీఓ రమాకాంత్, డీఆర్డీఓ మధుసూదన్ రాజు, డీఎంహెచ్ఓ శిరీష, డీసీహెచ్ఎస్ రవిబాబు, విద్యుత్ శాఖ ఎస్ఈ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఐటీడీఏలో కంట్రోల్ రూం ఏర్పాటు



భద్రాచలం: భద్రాచలం ఏజెన్సీలో వరదలు పెరుగుతున్న నేపథ్యంలో ఐటీడీఏ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు పీఓ ప్రతీక్ జైన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వరద ముంపునకు గురయ్యే ప్రజలు కంట్రోల్ రూం నంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించాలని, తద్వారా సహాయక చర్యలు త్వరగా చేపట్టే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. భద్రాచలం ఐటీడీఏలో 08743 - 232244, 9392052395 నంబర్లు, సబ్ కలెక్టరేట్‌లో 08743-232444, 7981219425, కొత్తగూడెం కలెక్టరేట్‌లో 08744 - 241950, 9392919743 నంబర్లు 24 గంటలూ అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.

భద్రగిరిని చుట్టుముట్టిన వర్షపునీరు

- పట్టణంలోని మురుగునీరు కూడా వచ్చి చేరిన వైనం
- మొరాయించిన స్లూయిజ్‌ల మోటార్లు
- విస్తా కాంప్లెక్స్, నిత్యాన్నదాన సత్రాల్లోకి నీరు


మోటార్లు పనిచేయక ముందు రామాలయం ముందు నిలిచిన వరద నీరు

భద్రాచలం: రెండు, మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పట్టణంలోని వీధులు జలమయంగా మారాయి. వరద నీటిని ఎత్తిపోసేందుకు ఏర్పాటు చేసిన భారీ మోటార్లు మొరాయించాయి. దీంతో పట్టణంలోని వర్షపు నీరు, మురుగు నీరు భారీ స్థాయిలో విస్తా కాంప్లెక్స్ వద్దనున్న స్లూయిజ్‌ల వద్దకు చేరుకుంది. 25 హెచ్‌పీ సామర్థ్యం ఉన్న రెండు మోటార్లను సిద్ధం చేసినా నీటిని కొద్ది సేపు తోడి ఆగిపోయాయి. దీంతో భద్రగిరి చుట్టు ఉన్న విస్తా కాంప్లెక్స్, నిత్యాన్నదాన సత్రం రోడ్డులోకి భారీగా నీరు చేరుకుంది. అన్నదాన సత్రం లోపలికి సైతం నీరు చేరుకుంది. ఇరిగేషన్ అధికారులు స్పందించి మోటార్లను సరి చేసి నీటిని మొత్తం మోటార్ల ద్వారా గోదావరిలోకి పంప్ చేశారు. స్లూయిజ్‌ల లోకి భారీగా చెత్తా చెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు చేరి నీటి లిఫ్టింగ్‌లో అడ్డుపడ్డాయని, దీంతోనే ఈ సమస్య ఏర్పడిందని ఇరిగేషన్ అధికారులు తెలిపారు.

స్లూయిజ్‌లతోనే అసలు సమస్య

గోదావరి వరద పట్టణంలోకి ప్రవేశించకుండా కరకట్ట అడ్డుగా ఉంటుంది. పట్టణంలోని వర్షపు, మురుగు నీరు గోదావరిలో డంప్ చేసేందుకు ఏర్పాటు చేసిన స్లూయిజ్‌లతోనే అసలు సమస్య ఏర్పడుతోంది. భారీగా వర్షపు నీరు చేరుకున్న సమయంలో విస్తా కాంప్లెక్స్ వద్దనున్న స్లూయిజ్‌ల వద్ద ఏర్పాటు చేసిన మోటార్లు పనిచేయకపోవడం రివాజుగా మారుతోంది. గతేడాది జూలైలో వచ్చిన భారీ గోదావరి వరదలకు, తాజాగా వచ్చిన కొద్ది సేపటి వర్షానికే ఆలయం చుట్టు నీరు చేరుకుంది. ఎంతో పవిత్రంగా భావించే దేవస్థానం మాడ వీధుల్లోకి పట్టణంలోని మురుగు నీరు, చెత్తా చెదారం చేరి అపవిత్రంగా మారుతోంది. ఆలయం చుట్టుపక్కల ప్రాంతాల్లోని చిరువ్యాపారులు చీటికి మాటికి మూటముల్లె సర్దుకోవాల్సి వస్తుంది. ఇక భక్తులకు అన్నదాన ప్రసాదం అందించే నిత్యాన్నదాన సత్రంలోకి సైతం ఈ నీరు వచ్చి ఇబ్బందులకు గురిచేస్తోంది. బదిలీపై వెళ్లిన కలెక్టర్ అనుదీప్, తాజాగా వచ్చిన కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా కూడా సమీక్ష సమావేశాల్లో ఈ మోటార్లను సిద్ధం చేసుకోవాలని పదే పదే సూచించారు. అయినా సరే గురువారం మోటార్లు సరిగా పనిచేయకపోవడంతో భద్రగిరి చుట్టు రెండు అడుగులకు పైగా నీరు చేరింది.

పకడ్బందీ చర్యలు చేపట్టాలి

ప్రభుత్వ విప్ కాంతారావు


అధికారులతో మాట్లాడుతున్న విప్ రేగా

భద్రాచలంఅర్బన్: గోదావరి వరదలతో ప్రజలు ఇబ్బంది పడకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు సూచించారు. భద్రాచలం వద్ద గోదావరి ఉధృతిని గురువారం ఆయన అధికారులతో పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వరదలు పెరిగే సూచనలు ఉన్నప్పుడు ముంపు ప్రజలకు అవగాహన కల్పించి పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు. తరలించే సమయంలో అన్ని సదుపాయాలు కల్పించాలని చెప్పారు. కాలువలు, చెరువులు, కుంటలు, చెక్ డ్యామ్‌ల వద్ద రక్షణ చర్య తీసుకోవాలన్నారు. రెవెన్యూ, పంచాయతీ, ఇరిగేషన్ విద్యుత్, పోలీస్ శాఖ, ఆరోగ్యశాఖ అధికారులు సమన్వయంతో పని చేయాలని చెప్పారు. భద్రాచలం ఆర్డీఓ రత్నకల్యాణి, ఏఎస్పీ పరితోష్ పంకజ్, భద్రాచలం స్పెషల్ ఆఫీసర్ నాగలక్ష్మి, భద్రాచలం ఇన్‌చార్జి తహసీల్దార్ రామకృష్ణ, గ్రామ పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.


భద్రగిరి తీరాన గోదావరి పరవళ్లు

అప్రమత్తంగా ఉండాలి

ఏఎస్పీ పరితోష్ పంకజ్

భద్రాచలంఅర్బన్: గోదావరి వరదల పట్ల ముంపు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికారుల సూచనలు, సలహాలు పాటించాలని ఏఎస్పీ పరితోష్ పంకజ్ అన్నారు. గురువారం ఆయన కరకట్టపై నుంచి గోదావరి ఉధృతిని పరిశీలించారు. కరకట్టపై వాహన రాకపోకలను నియంత్రించాలని సిబ్బందికి సూచించారు. ఎవరూ గోదావరి నది వద్దకు వెళ్లకుండా చర్యలు చేపట్టాలన్నారు. లైఫ్ జాకెట్లను, గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచాలని చెప్పారు.


భద్రాచలం వద్ద గోదావరి నదిలో వరద ఉధృతి

8 అడుగులకు పెదవాగు నీటిమట్టం

అశ్వారావుపేటరూరల్: మండలంలోని పెదవాగు ప్రాజెక్టు నీటిమట్టం మరో రెండు అడుగులు పెరిగింది. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు వచ్చి ప్రాజెక్ట్‌లో చేరుతోంది. గురువారం రాత్రికి నీటిమట్టం 8 అడుగులకు చేరినట్లు ప్రాజెక్టు ఏఈఈ కేఎన్‌బీ కృష్ణ తెలిపారు. కాగా రోజంతా కురిసిన వర్షానికి 32 మీ.మీటర్ల వర్షపాతం నమోదైంది.


పెదవాగు ప్రాజెక్ట్


భద్రాచలం: ఆలయానికి వెళ్లే దారిలో రోడ్డు మీదకు చేరుకున్న నీరు


భద్రాచలం: మోటార్లు పనిచేసిన అనంతరం ఆలయం వద్ద తగ్గిన నీరు


భద్రాచలం: మోటార్లను బాగు చేస్తున్న సిబ్బంది

జనావాసాల్లోకి వరదనీరు


ఇళ్ల చుట్టూ చేరిన వర్షపు నీరు

అన్నపురెడ్డిపల్లి: మండల వ్యాప్తంగా గురువారం 36.2 మి.మీ వర్షపాతం నమోదైంది. చెరువులు, కుంటల్లో భారీగా నీరు చేరి జలకళ సంతరించుకున్నాయి. వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. బుచ్చన్నగూడెంలోని నర్సాపాలెం , అన్నపురెడ్డిపల్లిలోని రాయుడి చెరువులు మత్తడి పోస్తున్నాయి. కట్టుగూడెం-అబ్బుగూడెం గ్రామాల మధ్య వాగు రోడ్డు పై ప్రవహిస్తోంది. వరి పొలాలు చెరువులును తలపిస్తున్నాయి. ఇళ్ల చుట్టూ వర్షపునీరు చేరింది.

లోతట్టు ప్రాంతాలు జలమయం


రాజుపేట వద్ద ప్రధాన రహదారిపై చేరిన వర్షపు నీరు

భద్రాచలంటౌన్: పట్టణంలో గురువారం ఉదయం కురిసిన ఎడతెరిపిలేని వర్షంతో పలు కాలనీలు, ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. చర్ల రోడ్డులోని రాజుపేట కాలనీ వద్ద ప్రధాన రహదారిపైకి వర్షపు నీరు చేరడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. కొత్త కానీలో ఇళ్లు జలమయమయ్యాయి.


భద్రాచలం: నిత్యాన్నదాన సత్రం చుట్టు చేరిన వరద నీరు

ఓటమి భయంతోనే అసత్య ప్రచారం

- ఎమ్మెల్యే మాటలను నమ్మే పరిస్థితి లేదు
- జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య


మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ కనకయ్య, పక్కన దళ్‌సింగ్ తదితరులు

ఇల్లెందు: ఇల్లెందు ఎమ్మెల్యే హరిప్రియకు ఓటమి భయం పట్టుకోవడంతోనే ఉచిత విద్యుత్ అంశంపై అసత్య ప్రచారం చేస్తున్నారని జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య విమర్శించారు. అయితే, రైతులు కానీ, ప్రజలు కానీ ఆ మాటలు నమ్మే పరిస్థితి లేదన్నారు. ఇల్లెందులోని ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ ఉచిత విద్యుత్ పథకాన్ని దివంగత వైఎస్.రాజశేఖరరెడ్డి హయాంలో కాంగ్రెస్సే ప్రవేశపెట్టిందని తెలిపారు. కానీ బీఆర్ఎస్ ప్రభుత్వమే ఇచ్చినట్లు తప్పుడుప్రచారం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ఉచిత విద్యుత్ అంశంపై టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను వక్రీకరించి అసత్య ప్రచారం చేస్తుండడం గర్హనీయమన్నారు. కాగా, రైతు వేదికలను అధికార పార్టీ కార్యక్రమాలకు వాడుకుంటున్నారని ఆరోపించిన ఆయన, బస్‌డిపో నేటికీ ప్రారంభానికి నోచుకోవడం లేదని అన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు భూక్యా దళ్‌సింగ్‌నాయక్, డానియేల్, సైదులు, సుదర్శన్‌కోరీ, నందకిషోర్, రామస్వామి, జీ.వీ.భద్రం, ఇబ్రహీం, తాటి చుక్కమ్మ, చాట్ల భాగ్యమ్మ, మండల రాము, పూనెం సురేందర్, కృష్ణ ప్రసాద్, మడుగు సాంబమూర్తి, శ్రీనివాస్, తాటి భిక్షం, శారద, ధనుంజయ్ పాల్గొన్నారు.

ఎరక్కపోయి వచ్చి..

- కుక్కలు వెంబడించడంతో బావిలో పడిన దుప్పి
- రక్షించిన అటవీ ఉద్యోగులు


దుప్పిని పైకి తీసుకొస్తున్న అటవీశాఖ సిబ్బంది (ఇన్‌సెట్) బావిలో పడిపోయిన దుప్పి

అడవిలో ఉండాల్సిన చుక్కల దుప్పి ఒకటి గురువారం మధ్యాహ్నం సమయంలో మండలంలోని పిండిప్రోలు శివాలయం సమీపానికి వచ్చింది. ఇంతలోనే కుక్కలు వెంబడించడంతో పరుగెత్తుతూ వ్యవసాయబావిలో పడింది.


జీపులో తీసుకెళ్తున్న ఉద్యోగులు

ఈ విషయాన్ని గమనించిన రైతులు కూసుమంచి ఎఫ్ఆర్ఓ పి.శ్రీనివాసరావుకు సమాచారం ఇవ్వగా ఆయనతో పాటు రేంజర్ సురేష్‌కుమార్, సిబ్బంది చేరుకున్నారు. తాళ్లసాయంతో బావిలోకి దిగి దుప్పిని బయటకు తీసుకొచ్చి వెటర్నరీ వైద్యులతో పరీక్ష చేయించారు. దుప్పికి ఎలాంటి గాయాలు కాలేదని, ఆరోగ్యంగా ఉందని చెప్పడంతో జూ పార్క్‌లో వదిలేందుకు గాను ఉద్యోగులు జీపులో తీసుకెళ్లారు. కాగా, చుక్కల దుప్పి వయస్సు సుమారు మూడేళ్లు ఉంటుందని, ఇక్కడకు ఎలా వచ్చిందో తెలియదని స్థానికులు చెబుతున్నారు. – తిరుమలాయపాలెం

టీబీ రహిత సమాజాన్ని ఆవిష్కరిద్దాం

చంద్రుగొండ : టీబీ (క్షయ) రహిత సమాజాన్ని ఆవిష్కరిద్దామని క్షయనివారణ జిల్లా అధికారి డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. చంద్రుగొండలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆయన సందర్శించారు. రికార్డులు పరిశీలించారు. బాధితుల ఇళ్లకు వెళ్లి ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీశారు. ప్రధానమంత్రి ముక్తిభారత్ అభియాన్ పథకం ద్వారా రాజ్యసభ సభ్యుడు పార్థసారథిరెడ్డి అందిస్తున్న న్యూట్రిషన్ కిట్లను పంపిణీ చేశారు. మందులు సక్రమంగా వాడాలని రోగులకు సూచించారు. డాక్టర్ కనకం తనూజ, హెల్త్‌సూపర్‌వైజర్ ఎండీ ఇమాం, సిబ్బంది పద్మ, పుల్లమ్మ, శ్రీనివాస్, రుక్మిణి పాల్గొన్నారు.

లింక్ రాడ్డు విరిగి..

పైకి లేచిన ట్రాక్టర్ ఇంజిన్


పైకి లేచిన ట్రాక్టర్ ఇంజిన్ భాగం

భద్రాచలంఅర్బన్: కూనవరం నుంచి అధిక లోడ్ జమాయిల్ కర్రతో వస్తున్న ట్రాక్టర్, ఇంజిన్ మధ్య లింక్ రాడ్డు విరగడంతో ఇంజిన్ నిలువుగా లేచింది. ఈ సంఘటన ప్రభుత్వ ఆస్పత్రి సెంటర్లో గురువారం జరిగింది.ఈ ఘటనలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు. ట్రాక్టర్‌లో పరిమితికి మించి జమాయిల్ కర్ర లోడ్ చేయడం వల్లే ఇలా జరిగిందని స్థానికులు చెబుతున్నారు.

ఇద్దరు నిందితుల అరెస్ట్

భద్రాచలంఅర్బన్: వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం... పట్టణంలోని అశోక్‌నగర్ కాలనీలో నివసించే రా జలిక బ్రహ్మానందాచారి తన కుటుంబ సభ్యులతో ఈ నెల 6న షిరిడీ యాత్రకు వెళ్లారు. 12న తిరిగి వచ్చేసరికి ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలో ఉన్న వెండి వస్తువులు, బంగారు ఆభరణాలు చోరీ చేశారు. సుమారు రూ.96,000 విలువైన సొత్తు చోరీ చేసినట్లు ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. సీసీ కెమెరాల ఫుటేజీసాయంతో లక్ష్మీదేవిపల్లికి చెందిన రంగుల దుర్గారావు, ఏపీలోని ఏలూరు జిల్లా కుక్కునూరు మండలం ఇబ్రహీంపేటకు చెందిన షేక్ జానీలను నిందితులుగా గుర్తించారు. వారి నుంచి 10 తులాల బంగారం రికవరీ చేశారు. అరెస్ట్ చేసి కోర్టులో రిమాండ్ చేశారు. వీరిలో జానీబాబు గత ఫిబ్రవరిలో పాల్వంచ గాంధీనగర్‌లో 74 గ్రాముల బంగారాన్ని దొంగిలించాడు. జిల్లాలో పలుచోట్ల చోరీలు చేసి జైలుకు కూడా వెళ్లి వచ్చాడు. నిందితులను పట్టుకోవడంలో కీలకపాత్ర పోషించిన సిబ్బంది లక్ష్మణ్, రామారావు, సూర్యారావు, శంకర్‌లను భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్ క్యాష్ రివార్డ్‌తో ప్రత్యేకంగా అభినందించారు. సీఐ నాగరాజు రెడ్డి, ఎస్సై మధు ప్రసాద్ పాల్గొన్నారు.

ముగ్గురు సీఐలకు పోస్టింగ్

కొత్తగూడెంఅర్బన్/కొత్తగూడెంటౌన్: జిల్లాలో ముగ్గురు సీఐలను నియమిస్తూ పోలీసు ఉన్నతాధికారులు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. మధిర సీఐగా పని చేస్తున్న వడ్డేపల్లి మురళిని కొత్తగూడెం త్రీటౌన్‌కు బదిలీ చేశారు. ఇతను రెండు రోజుల్లో బాధ్యతలు చేపట్టే అవకాశం ఉంది. గతంలో ఇక్కడ పని చేసిన అబ్బయ్య వరంగల్ కాకతీయ యూనివర్సిటీ పోలీసు స్టేషన్‌కు బదిలీ అయ్యారు. వైరాలో పనిచేస్తున్న టి.సురేష్ జూలూరుపాడు సీఐగా, డీసీఆర్‌బీలో పనిచేస్తున్న ఎం.నాగరాజును డీఎస్‌బీ సీఐగా నియమించారు.

క్లుప్తంగా

హ్యుండాయ్ ఎక్స్‌టర్ విడుదల


ఎక్స్‌టర్ కారును విడుదల చేస్తున్న డీటీఓ వేణు, తదితరులు

మంచుపల్లి: హ్యుండాయ్ కంపెనీ కొత్త మోడల్ ఎక్స్‌టర్ కారును విద్యానగర్‌లోని భారత్ హ్యుండాయ్ షోరూంలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీటీఓ పి.వేణు, సింగరేణి డైరెక్టర్ బి.సత్యనారాయణ ఈ కారును ఆవిష్కరించి మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండేలా కొత్త మోడళ్లను ప్రవేశపెట్టడం అభినందనీయమని తెలిపారు. అనంతరం షోరూం మేనేజర్ శబరీనాథ్ కారు ప్రత్యేకతలను వివరించారు. ఈ కార్యక్రమంలో షోరూం సిబ్బంది, వినియోగదారులు పాల్గొన్నారు.

'సింగరేణి'లో కూలిన వటవృక్షం

చెట్టు పడి నుజ్జునుజ్జయిన ఉద్యోగి కారు


సింగరేణి ప్రధాన కార్యాలయం ఆవరణలో కారుపై పడిన చెట్టు

సింగరేణి(కొత్తగూడెం): రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి సింగరేణి ప్రధాన కార్యాలయం ముందుభాగంలో ఉన్న సుమారు 70 ఏళ్ల పురాతనమైన మర్రి చెట్టు గురువారం ఉదయం సరిగ్గా 10 గంటలకు కూలి పడింది. పార్కింగ్ చేసిన హెడ్డాఫీస్ అటెండర్ బాబూరావు కారుపై పడింది. దీంతో వాహనం నుజ్జు నుజ్జయింది. అయితే ఉదయం 9.30 నిముషాలకు అధికారులు, ఉద్యోగులు విధిగా విధులకు హాజరవుతారు. వీరందరూ వచ్చి విధుల్లో చేరిన అర్ధగంట తర్వాత చెట్టు కూకటి వేళ్లతో కూలిపోయింది. అక్కడ ఆ సమయాన ఎవరూ లేకపోవటంతో ప్రమాదం తప్పినట్లయింది.

రాష్ట్రస్థాయికి 40 మంది క్రీడాకారుల ఎంపిక

కొత్తగూడెంటౌన్: క్రీడా పాఠశాలల్లో 4,5వ తరగతుల్లో ప్రవేశాల కోసం రాష్ట్రస్థాయి పోటీలకు 40 మంది బాలబాలికలను ఎంపిక చేసినట్లు జిల్లా యువజన క్రీడలశాఖ అధికారి (డీవైఎస్ఓ) టీ.సీతారాం తెలిపారు. గురువారం కొత్తగూడెం క్లబ్‌లో జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఎంపికలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. 4వ తరగతిలో బాలురు 10 మంది, బాలికలు 10 మంది, 5వ తరగతిలో బాలురు 10 మంది, బాలికలు 10 మందిని ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ నెల 27న హైదరాబాద్ హకీంపేట స్పోర్ట్స్ స్కూల్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు వీరు హాజరవుతారని పేర్కొన్నారు. అసిస్టెంట్ మేనేజర్ ఉదయ్‌కుమార్, సిబ్బంది తిరుమలరావు, లక్ష్మయ్య, స్టెల్లా, పీడీ, ప్రేమ్, నరేష్, వేణు, నాగేశ్వరరావు, మంగీలాల్, కధీర్, నాగలక్ష్మి, కవిత, సుజాత పాల్గొన్నారు.

కిన్నెరసానిని సందర్శించిన డీఎఫ్ఓ


మందెరకలపాడులో ప్లాంటేషన్‌ను పరిశీలిస్తున్న డీఎఫ్ఓ కృష్ణగౌడ్

పాల్వంచ: పర్యాటక ప్రాంతమైన కిన్నెరసాని డీర్‌పార్కుతోపాటు యానంబైల్ రేంజ్ పరిధిలోని మందెకలపాడు ప్లాంటేషన్‌ను గురువారం జిల్లా అటవీశాఖ అధికారి కృష్ణగౌడ్ సందర్శించి పరిశీలించారు. కిన్నెరసానిలోని డీర్ పార్కుతోపాటు పర్యావరణ భవనాన్ని పరిశీలించారు. ఎఫ్‌డీఓ కట్టా దామోదర్‌రెడ్డి, రేంజర్ శ్రీనివాసరావు, వైల్డ్‌లైఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

అమరవీరుల వారోత్సవాలు నిర్వహించాలి

మావోయిస్టు పార్టీ చర్ల–శబరి ఏరియా కమిటీ కార్యదర్శి అరుణ

చర్ల: ఈ నెల 28 నుంచి వచ్చే నెల 3వ తేదీ వరకు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను ఘనంగా నిర్వహించాలని మావోయిస్టు పార్టీ చర్ల శబరి ఏరియా కమిటీ కార్యదర్శి అరుణ పిలుపునిచ్చారు. గురువారం ఆమె పత్రికలకు ఒక లేఖ విడుదల చేశారు. గత ఏడాదికాలంలో 100 మందికి పైగా విప్లవకారులు అమరత్వం పొందారని, వారిలో పొలిట్ బ్యూరో సభ్యుడు కటకం సుదర్శన్ అలియాస్ ఆనంద్, డివిజనల్ కమిటీ సభ్యురాలు అనిత, పార్టీ సభ్యుడు అశోక్, చర్ల ఎల్‌ఓఎస్ కమాండర్ రాజేష్ తదితరులు ఉన్నారని, వారికి ఘనంగా నివాళులర్పించాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సమస్యలను పరిష్కరించకపోగా, ప్రజా ఉద్యమాలు, విప్లవోద్యమాలను అణచివేస్తున్నాయని ఆరోపించారు.

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.12,623

మూసీ స్కైవే ప్రతిపాదన రాలేదు

పార్లమెంట్‌లో స్పష్టం చేసిన కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షెకావత్



సాక్షి, న్యూఢిల్లీ: మూసీ నదిపై స్కైవే నిర్మాణానికి సంబంధించి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నుంచి కేంద్రం ఎటువంటి ప్రతిపాదనను అందుకోలేదని కేంద్ర జలశక్తి శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ తెలిపారు. కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా నుంచి అందిన సమాచారం ప్రకారం ప్రతిపాదన రాలేదన్నారు. అంతేగాక 2014 నుంచి తెలంగాణలో ఎన్ఆర్‌సీపీ కింద కొనసాగుతున్న ప్రాజెక్ట్ లేదని.. మూసీ నది కాలుష్య నివారణకు ఎటువంటి ప్రతిపాదన కూడా కేంద్రం పరిశీలనలో లేదని బీఆర్ఎస్ ఎంపీలు రంజిత్‌రెడ్డి, వెంకటేశ్ నేత అడిగిన ప్రశ్నలకు షెకావత్ లిఖిత పూర్వక సమాధానంలో తెలిపారు. కాగా తెలంగాణలో, మూసీ నది పరిరక్షణ కోసం ఎన్ఆర్‌సీపీ కింద రూ.335.65 కోట్ల వ్యయంతో కాలుష్య నివారణ పనులు మంజూరు చేసినట్లు షెకావత్ తెలిపారు. కాగా 2020లో హైదరాబాద్‌లో మూసీ నది పరిరక్షణకు సంబంధించిన 4 ఎస్‌టీపీ ప్రాజెక్టుల ప్రతిపాదనలను జలశక్తి మంత్రిత్వ శాఖ పరిశీలనలతో రాష్ట్ర ప్రభుత్వానికి తిరిగి పంపించగా, రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి సవరించిన ప్రతిపాదనను ఇప్పటివరకు కేంద్రానికి సమర్పించలేదని షెకావత్ వెల్లడించారు.

రహదారులకు రూ. 37 వేల కోట్లు...

తెలంగాణలో 1,958 కిలోమీటర్ల పొడవున్న 71 రహదారుల నిర్మాణ ప్రాజెక్టులకు గత మూడేళ్లలో రూ.37,069 కోట్లు మంజూరు చేశామని.. అందులో గత నెల 30వ తేదీ వరకు రూ.2,580 కోట్లు సివిల్ పనులకు ఖర్చు చేసినట్లు కేంద్ర రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ పేర్కొన్నారు. బీఆర్ఎస్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి అడిగిన ప్రశ్నలకు కేంద్రమంత్రి బదులిచ్చారు.

కోర్టుకు గైర్హాజరైనా చర్యలు వద్దు: హైకోర్టు

భారీ వర్షాలతో నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: న్యాయవాదులు, కక్షిదారులు శుక్రవారం కోర్టుకు హాజరుకాకపోయినా ఎలాంటి ప్రతికూల ఆదేశాలు, వారెంట్లు జారీ చేయవద్దని కింది కోర్టులకు హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అభినంద్ కుమార్ షావిలి ఆదేశించారు. భారీ వర్షాల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు గురువారం రిజిస్ట్రార్ జనరల్ కె.సుజన ఉత్తర్వులు జారీ చేశారు.

విద్యాసంస్థలకు సెలవులు..

పరీక్షలు వాయిదా

ఎడతెరిపిలేని వానలతో ప్రభుత్వం అప్రమత్తం

- గురు, శుక్రవారాలు బంద్.. వానలు తగ్గకపోతే మరో రోజూ సెలవు
- గురువారం పిల్లలు స్కూళ్లకు చేరాక సెలవు ప్రకటనతో ఇబ్బంది
- యూనివర్సిటీ పరిధిలో అన్ని పరీక్షలు రద్దు
- వానలతో పలుచోట్ల విద్యుత్, ఇంటర్నెట్‌కు అంతరాయం
- ఇంజనీరింగ్ సెల్ఫ్ రిపోర్టింగ్ గడువు పెంచాలని విద్యార్థుల విజ్ఞప్తి
- గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో విద్యా సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలకు కూడా శుక్ర, శనివారాలు సెలవు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా ఎడతెరిపిలేని వానలు పడుతుండటంతో ప్రభుత్వం గురు, శుక్ర వారాలు రెండు రోజులపాటు విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించింది. వానలు తగ్గకపోతే శనివారం కూడా సెలవు ఇవ్వాలని క్షేత్రస్థాయిలో అధికారులకు మౌఖిక ఆదేశాలు అందాయి. ఈ నేపథ్యంలో ఇప్పటికే ప్రకటించిన పలు పరీక్షలను రద్దు చేశారు. అన్ని యూనివర్సిటీల పరిధిలో జరుగుతున్న డిగ్రీ పరీక్షలు వాయిదా పడ్డాయి. ఇంజనీరింగ్ కాలేజీల్లో జరిగే ఇంటర్నల్ పరీక్షలను రద్దు చేశారు. వీటిని తిరిగి ఎప్పుడు నిర్వహించేదీ తర్వాత ప్రకటిస్తామని అధికారులు చెప్పారు. ఇక ఇంజనీరింగ్ సహా వివిధ రకాల కౌన్సెలింగ్‌ల తేదీలను మార్చాలని విద్యార్థులు కోరుతున్నారు.

అకస్మాత్తుగా సెలవు నిర్ణయంతో..

రెండు రోజులుగా వానలు పడుతుండటంతో విద్యాసంస్థలకు సెలవులు ఇవ్వాలన్న విజ్ఞప్తులు వచ్చాయి. కానీ దీనిపై బుధవారం రాత్రి వరకు కూడా అధికారులు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. రెండు రోజుల పాటు సెలవులు ఇస్తున్నట్టుగా గురువారం ఉదయం ప్రకటించారు. ఇది కూడా జిల్లా అధికారులకు మెసేజీల ద్వారా తెలిపారు. మీడియాకు సమాచారం ఇవ్వలేదు. దీనితో సెలవుల విషయం తెలిసేసరికే విద్యార్థులంతా వానలో ఇబ్బందిపడుతూనే స్కూళ్లకు చేరారు. కొన్నిచోట్ల అప్పటికప్పుడే విద్యార్థులను తిప్పి పంపేయగా.. మరికొన్ని విద్యా సంస్థలు ఒంటి గంట వరకు ఇళ్లకు పంపించాయి. ఆటోల్లో, సైకిళ్లపై, నడుచుకుంటూ బడులకు వచ్చే విద్యార్థులు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. సెలవు విషయం తెలియడంతో తల్లిదండ్రులు హడావుడిగా స్కూళ్ల వద్దకు వచ్చి పిల్లలను తీసుకెళ్లాల్సి వచ్చింది.

హాస్టళ్ల నుంచి ఇళ్లకు..

ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలోని విద్యార్థులు ఇళ్లకు వెళ్లేందుకు అనుమతిస్తున్నారు. చాలాచోట్ల హాస్టళ్ల చుట్టూ నీరు చేరడం, పలుచోట్ల పైకప్పుల నుంచి నీరు కారడంతో ఇబ్బందిగా మారిందని సిబ్బంది వాపోతున్నారు.

ఇంటర్నెట్ ఇబ్బందితో..

ఎంసెట్ తొలివిడత కౌన్సెలింగ్‌లో భాగంగా ఇటీవలే మొదటి విడత సీట్ల కేటాయింపు జరిగింది. ఈ నెల 22 నాటికల్లా ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంది. రెండు రోజులుగా వానలతో పలుచోట్ల విద్యుత్ సరఫరా, ఇంటర్నెట్‌కు అంతరాయం ఏర్పడింది. దీనితో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయడానికి ఇబ్బంది పడుతున్నామని, సెల్ఫ్ రిపోర్టింగ్ గడువు పొడిగించాలని విద్యార్థులు కోరుతున్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఉన్నత విద్యా మండలి అధికారి ఒకరు తెలిపారు. ఇక గురువారం జరగాల్సిన టైప్ రైటింగ్, షార్ట్ హ్యాండ్ పరీక్షలను వాయిదా వేస్తున్నట్టు సాంకేతిక విద్యా మండలి ప్రకటించింది.

గ్రేటర్ హైదరాబాద్‌లో శుక్ర, శనివారాలు సెలవు

ఎడతెరిపిలేని వానల నేపథ్యంలో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో అన్నిరకాల విద్యాసంస్థలతోపాటు ప్రభుత్వ కార్యాలయాలకు కూడా శుక్ర, శనివారాలు రెండు రోజుల పాటు ప్రభుత్వం సెలవులను ప్రకటించింది. వైద్యం, పాల సరఫరా వంటి అత్యవసర సేవలు కొనసాగుతాయని తెలిపింది. ప్రైవేటు సంస్థలు కూడా వారి కార్యాలయాలకు సెలవులు ప్రకటించేలా చర్యలు చేపట్టాలని కార్మికశాఖను ఆదేశించింది. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ సీఎస్ శాంతికుమారి జీహెచ్‌ఎంసీ పరిధిలో విద్యాసంస్థలు, ప్రభుత్వ/ప్రైవేటు కార్యాలయాలకు రెండు రోజుల సెలవు ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రపంచంతో పోటీ

- మా పిల్లలను వెస్టర్న్ వరల్డ్ స్థాయికి తీసుకెళ్లడమే లక్ష్యం
- ఫ్యూచర్ టెక్నాలజీ స్కిల్స్‌పై హైపవర్ వర్కింగ్ గ్రూపుతో భేటీలో ఏపీ సీఎం జగన్



సాక్షి, అమరావతి : పాఠశాల విద్య నుంచి ఉన్నత విద్య వరకు విద్యార్థులకు ఫ్యూచర్ టెక్నాలజీపై నైపుణ్యాభివృద్ధిని అందించాల్సి ఉందని, ఆ మేరకు పాఠ్యాంశాలు, పాఠ్య ప్రణాళికకు రూపకల్పన చేయాలని ఏపీ సీఎం వైఎస్ జగన్ స్పష్టం చేశారు. ఇందుకు అనుగుణంగా బోధనలో, శిక్షణలో ఫ్యూచర్ టెక్నాలజీ వినియోగంపై కార్యాచరణ రూపొందించాలన్నారు. ఫ్యూచర్ టెక్నాలజీ స్కిల్స్‌పై గురువారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో హైపవర్ వర్కింగ్ గ్రూపుతో సమావేశం అయ్యారు. విద్యా శాఖ, మైక్రోసాఫ్ట్, గూగుల్, ఇంటెల్, నాస్కామ్, అమెజాన్ వెబ్ సర్వీసెస్, డేటావివ్ వంటి ప్రఖ్యాత సంస్థల ప్రతినిధులతో చర్చించారు. ఐబీ (ఇంటర్‌నేషనల్ బాకలారియేట్)తో కలిసి ఒక కొత్త సిలబస్‌ను రూపొందించబోతున్నామని, అది దేశానికే బెంచ్ మార్క్ కాబోతుందని సీఎం జగన్ తెలిపారు. ఐబీ, ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జ్‌తో కలిసి టీచింగ్ మెథడాలజీని, పాఠ్య ప్రణాళికను మార్చబోతున్నామని.. దీనికి మీ సహకారం అవసరమని కోరారు. తద్వారా ఈ కల సాకారమయ్యే దిశగా అడుగులు వేస్తున్నామని చెప్పారు. 'వెస్టర్న్ వరల్డ్‌లో ఉన్న బోధనా స్థాయిలను అలవర్చుకుంటేనే మన పిల్లలు కూడా ఆ స్థాయికి చేరి పోటీ పడగలుగుతారు. దీని కోసం ప్రశ్నా విధానం, పిల్లలకు బోధించే విధానంలో కూడా మార్పు రావాలి. కరిక్యులమ్‌లో కూడా మనం వాళ్లకంటే ఏ మేరకు మెరుగు పరుచుకోవాలన్న విషయాన్ని పరిశీలించాలి. ఇందుకు పాఠశాల స్థాయిలో కూడా బోధన, బోధనా విధానా ల్లో ఎలాంటి మార్పులు తీసుకురావాలన్నది ఆలోచించాలి. స్టేట్ సిలబస్, నేషనల్ సిలబస్, సీబీఎస్‌ఈ వంటి అంశాలకే పరిమితం కాకుండా ఇంకా ముందుకు అడుగులు వేయాలి. ఉన్నత విద్యలో పరీక్షా విధానం, మెథడాలజీ, బోధనా పద్ధతులు, పాఠ్య ప్రణాళికలో తీసుకురావాల్సిన మార్పులపై దృష్టి సారించాలి. వెస్టర్న్ వరల్డ్ తరహాలో మరిన్ని వర్టికల్స్‌ను అందుబాటులోకి తీసుకురావడంపై అధ్యయనం చేయాలి. వర్చువల్ టీచింగ్, వర్చువల్ కంటెంట్ అందుబాటులోకి తేవాలి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)లో వస్తున్న మార్పులను కరిక్యులమ్‌లో భాగం చేయా లి. ఇంజనీరింగ్, మెడిసిన్‌లో ఎలా భాగస్వామ్యం చేయాలన్న దానిపై అధ్యయనం చేయాలి. సులభంగా అర్థమయ్యేలా ఆచరణీయంగా ఉండేలా మార్పు చేయాలి' అని సీఎం వైఎస్ జగన్ నిర్దేశించారు.

ఇద్దరు మావోయిస్టుల అరెస్ట్

- విప్లవ సాహిత్యంతోపాటు రూ.3.40లక్షల నగదు స్వాధీనం

కొత్తగూడెం టౌన్: నిషేధిత సీపీఐ మావోయిస్టు రాష్ట్ర కమిటీ సభ్యుడితో పాటు మరో దళ సభ్యుడిని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసులు అరెస్ట్ చేశారు. ఈమేరకు కొత్తగూడెంలో గురువారం ఎస్పీ డాక్టర్ వినీత్ వివరాలు వెల్లడించారు. జిల్లాలోని చర్ల బస్టాండ్ సెంటర్‌లో గురువారం ఉదయం పోలీసులు, సీఆర్‌పీఎఫ్ జవాన్లు తనిఖీలు చేపట్టి ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారించారు. వీరిద్దరూ అశ్వాపురం మండలం చింతిర్యాలకు చెందిన తోట సీతారామయ్య, జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం నేరెళ్లకు చెందిన పాదం రాజ్‌కుమార్‌గా తేలింది. తోట సీతారామయ్య అలియాస్ కృష్ణన్న అలియాస్ సంజీవ్ మావోయిస్టు రాష్ట్ర కమిటీ సభ్యుడిగా, రాజ్‌కుమార్ అలియాస్ అమరేందర్ దళ సభ్యుడిగా పనిచేస్తున్నట్లు విచారణలో ఒప్పుకున్నారు. వీరి నుంచి విప్లవ సాహిత్యం, రివాల్వర్, 6 రౌండ్లు(తూటాలు), రూ.3,40,000 నగదు స్వాధీనం చేసుకున్నారు. రహస్యంగా పార్టీ కార్యకలాపాలను విస్తరించేందుకు హైదరాబాద్ వెళ్తున్న సీతారామయ్యను ప్రొటెక్షన్ టీం సభ్యుడైన నరేష్(ఏసీఎం) మోటార్ సైకిల్‌పై చర్లకు తీసుకొచ్చి, మావోయిస్టు దళ సభ్యుడు పాదం రాజ్‌కుమార్‌ను పరిచయం చేసి వెళ్లాడు. ఆ తర్వాత వీరిద్దరూ చర్ల బస్టాండ్ సెంటర్‌లో ఉండగా పట్టుబడ్డారు. వీరిపై ఉపా చట్టం ప్రకారం కేసులు నమోదు చేసినట్లు ఎస్పీ తెలిపారు. పోలీసులపై దాడులు, తదితర ఘటనల్లో పాల్గొన్న సీతారామయ్యపై రూ.20 లక్షలు, రాజ్‌కుమార్‌పై రూ.లక్ష రివార్డు ఉందని ఆయన వెల్లడించారు.

మరోసారి వాయిదా కోరొద్దు..

ఓటుకు కోట్లు కేసులో రేవంత్ న్యాయవాదికి సుప్రీం స్పష్టీకరణ

సాక్షి, న్యూఢిల్లీ: తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన ఓటుకు కోట్లు కేసు విచారణను సుప్రీం కోర్టు వాయిదా వేసింది. విచారణపై మరోసారి వాయిదా కోరవద్దంటూ రేవంత్‌రెడ్డి తరపు న్యాయవాదిని ఉద్దేశించి పేర్కొంది. తెలంగాణ హైకోర్టు ఆదేశాలను సవాల్ చేస్తూ రేవంత్‌రెడ్డి, సండ్ర వెంకట వీరయ్యలు దాఖలు చేసిన వేర్వేరు పిటిషన్లను జస్టిస్ సంజీవ్‌ఖన్నా, జస్టిస్ బేలా ఎం త్రివేదీలతో కూడిన ధర్మాసనం గురువారం విచారించింది. సీనియర్ న్యాయవాది అందుబాటులో లేని కారణంగా విచారణ వాయిదా వేయాలని రేవంత్ తరపు న్యాయవాది కోరారు. దీనిపై తెలంగాణ ప్రభుత్వం తరపు సీనియర్ న్యాయవాది హరీన్ రావెల్ అభ్యంతరం వ్యక్తం చేశారు. హైకోర్టులో రివిజన్ పిటిషన్ పరిస్థితి ఏంటని జస్టిస్ సంజీవ్ ఖన్నా ప్రశ్నించగా... గత ఆగస్టు నుంచి పిటిషన్ విచారణకు రాకుండా వాయిదాలు కోరి జాప్యం చేస్తున్నారని హరీన్‌రావెల్ చెప్పారు. విచారణ వాయిదా ఎందుకని ధర్మాసనం ప్రశ్నించగా ఓటుకు కోట్లు కేసుకు అవినీతి నిరోధక చట్టం వర్తించదని రేవంత్ న్యాయవాది తెలిపారు. చట్టం ఎందుకు వర్తించదని జస్టిస్ సంజీవ్ ఖన్నా ప్రశ్నించగా.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రలోభాలకు గురిచేశారని అభియోగం మోపారని, ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం సివిల్ కోర్టులు దీనిపై నిర్ణయం తీసుకోలేవని రేవంత్ తరపు న్యాయవాది తెలిపారు. ఈ విషయం తేల్చాల్సింది ట్రయల్ కోర్టు అని, తాము కాదని జస్టిస్ సంజీవ్‌ఖన్నా వ్యాఖ్యానించారు. తదుపరి విచారణ ఆగస్టు 28తో ప్రారంభయ్యే వారానికి వాయిదా వేస్తున్నామని ధర్మాసనం స్పష్టం చేసింది.



న్యాయవాదుల మనోభావాలు దెబ్బతినేలా వారిపై అనుచితవ్యాఖ్యలు చేసిన టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని హైకోర్టు న్యాయవాదులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు గురువారం హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అభినంద్ కుమార్ షావిలిని కలసి వినతిపత్రం సమర్పించారు.

– యాకుత్‌పురా

వర్ధన్నపేట్ నుంచి పోటీకి రిటైర్డ్ సీపీ కసరత్తు?

ఖలీల్‌వాడి: ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వర్ధన్నపేట్ శాసన సభ నియోజకవర్గం నుంచి పోటీ చేయడానికి నిజామాబాద్ రిటైర్డ్ సీపీ కేఆర్ నాగరాజు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ఆయన తొలుత బీఆర్ఎస్ టికెట్‌పై ఉమ్మడి వరంగల్ నుంచి పోటీ చేస్తారని జిల్లాలో ప్రచారం జరిగింది. మంత్రి ప్రశాంత్‌రెడ్డి ద్వారా ఎమ్మెల్యేగా పోటీ చేయడానికి ఆయన ప్రయత్నాలు చేస్తున్నారని రాజకీయ వర్గాలు చర్చించుకున్నాయి. అయితే ఉమ్మడి వరంగల్ జిల్లాలో కారులో సీట్లు ఫుల్ కావడంతో ఎమ్మెల్యేగా పోటీ చేయడానికి బీఆర్ఎస్ అధిష్టానం నుంచి ఆయనకు స్పష్టత రాలేదని తెలిసింది. దీంతో రిటైర్డ్ సీపీ ఇతర పార్టీల వైపు చూస్తున్నారని సమాచారం. ఈనెల 30న మహబూబ్‌నగర్ జిల్లాలోని కొల్లాపూర్ సభలో ప్రియాంక గాంధీ సమక్షంలో ఆయన కాంగ్రెస్‌లో చేరే అవకాశమున్నట్లు తెలుస్తోంది.

జిల్లా వార్తలు

ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలాలి

బీఆర్ఎస్ లోక్‌సభా పక్షనేత నాగేశ్వరరావు

ఖమ్మంమయూరిసెంటర్: భద్రాచలం వద్ద గోదావరికి వరద పెరుగుతుండడంతో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసిన నేపథ్యాన పరీవాహక మండలాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బీఆర్ఎస్ లోక్‌సభా పక్ష నేత, ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో సూచించారు. ఆయా ప్రాంతాల్లోని ప్రజలు అధికారుల సూచన మేరకు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని తెలిపారు. ఏ ఒక్కరూ వరదలతో నష్టపోకుండా సీఎం కేసీఆర్ ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారని పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూంకు ఫోన్ చేయాలని సూచించారు.

మణిపూర్ దుర్మార్గానికి మోదీ, షాదే బాధ్యత

ఖమ్మంమయూరిసెంటర్/ఇల్లెందు: మణిపూర్‌లో కుకీ గిరిజన మహిళలపై సామూహిక అత్యాచారం జరిపి కిరాతకంగా హత్య చేసిన ఘటనకు ప్రధానమంత్రి మోదీ, హోంమంత్రి అమిత్‌షా బాధ్యత వహించాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, ప్రగతిశీల మహిళా సంఘం జాతీయ కన్వీనర్ వి.సంధ్య డిమాండ్ చేశారు. బీజేపీ పథకం ప్రకారమే వంద రోజులుగా మణిపూర్‌లో అల్లర్లకు దిగగా.. కిరాతకంగా హత్య చేయిస్తోందని ఆరోపించారు. ఇది బీజేపీ ఫాసిస్ట్ అజెండాలో భాగమేనని వారు తెలిపారు. ఈమేరకు మణిపూర్ ముఖ్యమంత్రి వెంటనే రాజీనామా చేయాలని, కేంద్ర హోమ్ మంత్రి అమిత్‌షాపై విచారణ జరిపించాలని రంగారావు, సంధ్య వేర్వేరు ప్రకటనల్లో డిమాండ్ చేశారు.

పంటల సాగులో జాగ్రత్తలు తప్పనిసరి

సూపర్‌బజార్(కొత్తగూడెం): భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యాన రైతులు పంటల సాగులో తగిన జాగ్రత్తలు వహించాలని కొత్తగూడెంలోని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు సూచించారు. వర్షాధార పంటలైన పత్తి, కంది, మొక్కజొన్న, జొన్న, వేరుశెనగ, పెసర, మినుము సాగు చేస్తున్న రైతులు పొలాల్లో నీరు అధికంగా నిల్వ ఉండకుండా బయటకు పంపించాలని తెలిపారు. ఒకవేళ నీరు, తేమ ఎక్కువగా ఉంటే ఎరువులు వేయడం వాయిదా వేసుకోవాలని సూచించారు. లేనట్లయితే ఎరువుల ధాటికి మొక్కల వేర్లు కుళ్లిపోవడంతో పాటు చనిపోయే ప్రమాదం ఉంటుందని పేర్కొన్నారు. అలాగే, వరి, మిరప నారుమడుల్లో కూడా నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని శాస్త్రవేత్తలు ఓ ప్రకటనలో తెలిపారు.

ఎన్‌క్వాస్.. ఎంతెంత దూరం?!

- భద్రాచలం ఆస్పత్రిని ఇటీవల పరిశీలించిన కేంద్ర బృందం
- అవార్డుకు ఎంపికైతే రూ.20 లక్షల రివార్డు
- గతంలో రాష్ట్ర, కేంద్ర అవార్డులకు ఎంపిక



భద్రాచలం ఏరియా ఆస్పత్రి

భద్రాచలంఅర్బన్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలోని ఏరియా ఆస్పత్రికి ఎన్‌క్వాస్ గుర్తింపుపై ఉత్కంఠ నెలకొంది. జాతీయ నాణ్యతా ప్రమాణాల హామీ సంస్థ(ఎన్‌క్వాస్) గుర్తింపు కోసం ఆస్పత్రి పోటీ పడుతుండగా, ఈనెల మొదటి వారంలో కేంద్రం బృందం పరిశీలించింది. ఈ ఏడాది ఏప్రిల్ 21, 22న ముస్కాన్, లక్ష్య బృందాలు ఆస్పత్రిని సందర్శించగా ఇందులో ముస్కాన్ అవార్డు ప్రకటించారు. ఈ అవార్డు ద్వారా మూడేళ్ల పాటు రూ.24 లక్షల చొప్పున నిధులు అందనున్నాయి. అయితే, లక్ష్య అవార్డుకు సంబంధించి రెండు విభాగాల్లో పోటీ పడగా కేవలం లేబర్ రూంకు మాత్రం అవార్డుకు ఎంపిక కావడంతో ఏటా రూ.2 లక్షల చొప్పున మూడేళ్లకు రూ.6 లక్షల నగదు పురస్కారం అందనుంది. ఇంతలోనే ఎన్‌క్వాస్ బృందం కూడా సందర్శించిన నేపథ్యాన అవార్డు ప్రకటన కోసం ఎదురుచూస్తున్నారు.

మూడేళ్లకోసారి పరిశీలన

ఎన్‌క్వాస్ బృందం మూడేళ్లకోసారి ఆస్పత్రిని పరిశీలించి అవార్డు ప్రకటిస్తుంది. తొలిసారి 2018లో భద్రాచలం ఏరియా ఆస్పత్రిని సందర్శించి గుర్తింపు ఇచ్చారు. ఆ తర్వాత 2021లో కరోనా ఉధృతి కారణంగా తనిఖీలు జరగలేదు. మళ్లీ ఈ నెల మొదటి వారంలో వచ్చిన బృందం అన్ని విభాగాల్లో క్షుణ్ణంగా తనిఖీలు చేసింది. ఈసారి ఎన్‌క్వాస్ అవార్డుకు ఎంపికైతే 200 పడకలు కలిగిన ఆస్పత్రి ప్రతి పడకకు రూ.10 వేల చొప్పున మూడేళ్లపాటు రూ.20 లక్షల నిధులు అందుతాయి.



ఆస్పత్రిలో పరిశీలిస్తున్న ఎన్‌క్వాస్ బృందం (ఫైల్)

గతంలో ఐదు సార్లు 'కాయకల్ప'

భద్రాచలం ఏరియా ఆస్పత్రి నిర్వహణ, సేవల్లో గతంలో ఐదు సార్లు కాయకల్ప అవార్డు లభించింది. 2016–17 మొదటి బహుమతి (రూ.20 లక్షలు), 2017–18లో ద్వితీయ బహుమతి (రూ.15 లక్షలు), 2018–19లో మొదటి బహుమతి (రూ.20 లక్షలు), 2019–20లో ప్రోత్సాహక బహుమతి(రూ.లక్ష), 2020–21లో మొదటి బహుమతి (రూ. 20 లక్షలు)కి ఎంపికైంది. తద్వారా అందే నిధులతో ఆస్పత్రిలో మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నారు. ఇప్పుడు ఎన్‌క్వాస్ అవార్డుకు కూడా ఎంపికైతే మూడేళ్ల పాటు రూ.24లక్షల చొప్పున అందే నిధులతో పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించేలా వసతులు, పరికరాలు సమకూరనున్నాయి.

మరింత అభివృద్ధి చేసుకోవచ్చు



స్వచ్ఛత, వైద్య సేవల్లో ఇప్పటి వరకు జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిలో గుర్తింపు లభించింది. జాతీయ స్థాయిలో మరోసారి ఎన్‌క్వాస్ గుర్తింపు వస్తే ఆస్పత్రిని అన్ని విధాలా అభివృద్ధి చేసుకునేందుకు నిధులు అందుతాయి. తద్వారా ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించవచ్చు. కేంద్ర బృందం ఆస్పత్రిలో పర్యటించిన సందర్భంగా సంతృప్తి చెందిందనే నమ్మకం ఉంది.

– డాక్టర్ రామకృష్ణ, ఆస్పత్రి సూపరింటెండెంట్

'సాగు–బాగు'పై కేంద్ర బృందం ఆరా



రైతులతో మాట్లాడుతున్న కేంద్ర ప్రభుత్వ అధికారులు

కూసుమంచి: కూసుమంచి వ్యవసాయ డివిజన్ పరిధిలో వ్యవసాయ, ఉద్యానవన శాఖల సహకారంతో డిజిటల్ గ్రీన్ సంస్థ ఆధ్వర్యాన రైతుల అభ్యున్నతి కోసం గత ఏడాది నుంచి సాగు–బాగు ప్రాజెక్టును అమలుచేస్తున్నారు. ఈ ప్రాజెక్టు నేషనల్ ఈ–గవర్నెన్స్ అవార్డుకు ఎంపిక కాగా కేంద్ర అధికారుల బృందం గురువారం పరిశీలించింది. ఈసందర్భంగా కూసుమంచిలోని రైతు వేదికలో నిర్వహించిన సమావేశంలో ఐఏఎస్ అధికారులైన విజయ్‌కుమార్, అవినాష్‌చంద్ర శర్మ తదితరులు పాల్గొని ప్రాజెక్టు అమలుతో రైతులకు కలిగిన లాభాలను తెలుసుకున్నారు. నాణ్యమైన మిర్చి ఎలా పండించగలిగారు, ఎలాంటి సలహాలు అందాయి, ఎంత ధర లభించిందో తెలుసుకున్నారు. అనంతరం డిజిటల్ గ్రీన్ ప్రతినిధులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరాలను వెల్లడించచారు. జిల్లా వ్యవసాయ, ఉద్యానవన అధికారులు విజయనిర్మల, అనసూయ, ఏడీఏ విజయచంద్ర, అధికారులు బాషా, సరిత, వాణి, డిజిటల్ గ్రీన్ సంస్థ ప్రతినిధులు యశోద, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

షిర్డీ నుంచి భద్రాచలానికి పాదయాత్ర

నేలకొండపల్లి: మహారాష్ట్రలోని షిర్డీ నుంచి భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయం వరకు పలువురు భక్తులు పాదయాత్రగా వస్తున్నారు. పది మందితో కూడిన ఈ బృందం గురువారం నేలకొండపల్లి మండలానికి చేరుకోగా పలు గ్రామాల్లో స్థానికులు స్వాగతం పలికి ఆర్థిక సాయం అందజేశారు. తాము కోరిన కోర్కెలు నెరవేరడంతో పాదయాత్రగా రామయ్య దర్శనానికి వెళ్తున్నట్లు వారు తెలిపారు.



పాదయాత్రగా వెళ్తున్న భక్తులు

భద్రాద్రి ఆలయ ఆధీనంలోకి 'శ్రీరామ నిలయం'



రికార్డులు పరిశీలిస్తున్న ఈఓ రమాదేవి, ఉద్యోగులు

భద్రాచలం: భద్రాచలంలోని శ్రీరామ నిలయం మళ్లీ శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం ఆధీనంలోకి వచ్చింది. ఈమేరకు గురువారం సాయంత్రం ఆలయ ఈఓ రమాదేవి రికార్డులు స్వాధీనం చేసుకున్నారు. భద్రాద్రిలో కరకట్టకు దిగువన భక్తుల వసతి కోసం 64 గదులతో నిర్మించిన శ్రీరామనిలయం నిర్వహణ గతంలో దేవస్థానం ఆధ్వర్యంలోనే కొనసాగేది. అయితే, ఈఓగా పనిచేసిన శివాజీ హయాంలో దీనిని ప్రైవేట్ వ్యక్తులకు కేవలం రూ.95 వేల అద్దెకే కట్టబెట్టారు. ఈ విషయమై భక్తుల నుంచి అభ్యంతరాలు వెల్లువెత్తగా, సాక్షిలోనూ కథనాలు ప్రచురితమయ్యారు. అలాగే, వసతి గృహం నిర్వహణలో లోపాలు, సిబ్బందికి నిబంధనల ప్రకారం వేతనాలు చెల్లించడంలేదని దేవాదాయ శాఖ కమిషనర్‌కు ఫిర్యాదులు అందాయి. ఈమేరకు విచారణ అనంతరం స్వాధీనం చేసుకోవాలని ఆదేశాలు రావడంతో ఈఓ రమాదేవి స్వాధీనం చేసుకున్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ సిబ్బందికి పీఎఫ్‌తో కూడిన వేతనం చెల్లించటం లేదని, వసతి గృహాన్ని పరిశుభ్రంగా ఉంచకుండా పూర్తిగా వ్యాపార ధోరణిలో నిర్వహిస్తున్నట్లు తమ విచారణలో తేలిందని వెల్లడించారు. త్వరలోనే మరమత్తులు చేయించి భక్తులకు అందుబాటులోకి తీసుకొస్తామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు శ్రవణ్‌కుమార్, భవానీరామకృష్ణ, ఈఈ రవీందర్, సీసీ అనిల్, సిబ్బంది పాల్గొన్నారు.

భద్రాద్రి కలెక్టర్‌ను కలిసిన సింగరేణి డైరెక్టర్, అధికారులు

సింగరేణి(కొత్తగూడెం): జిల్లా కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ప్రియాంక అలాను సింగరేణి డైరెక్టర్ బి.సత్యనారాయణరావు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు కలెక్టర్ పుష్పగుచ్ఛం అందజేశాక సంస్థ కార్యకలాపాలను వివరించారు. జీఎం బి.హన్మంతరావు, అధికారులు జి.సూర్యకుమార్, అచ్యుతరావు, కె.అజయ్ కుమార్ పాల్గొన్నారు.

సూపర్‌బజార్(కొత్తగూడెం)/ఇల్లెందు: కలెక్టర్ ప్రియాంకను సింగరేణి కొత్తగూడెం, ఇల్లెందు ఏరియాల జీఎంలు ఎం.షాలెంరాజు, జాన్ ఆనంద్ గురువారం కలిశారు. కాగా, ఇల్లెందు జీఎం జాన్ ఆనంద్ డీఎఫ్‌ఓ కిష్టాగౌడ్‌ను కూడా కలిసి అటవీ అనుమతులపై చర్చించారు. అధికారులు తావుర్యానాయక్, శ్రీనివాస్, మల్లయ్య, మహేష్, శివకుమార్ పాల్గొన్నారు.

మరణశాసనంగా మారిన సీపీఎస్

టీఎస్‌సీపీఎస్ ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ



అంబేద్కర్ విగ్రహం వద్ద యూనియన్ నాయకులు

ఇల్లెందు: రాష్ట్రంలోని 1.72 లక్షల మంది ఉద్యోగుల పాలిట మరణశాసనంగా మారిన సీపీఎస్ విధానాన్ని ప్రభుత్వం రద్దు చేయాలని టీఎస్‌సీపీఎస్‌ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ డిమాండ్ చేశారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పింఛన్ విధానం(ఓపీఎస్)ను పునరుద్ధరించాలనే డిమాండ్‌తో చేపట్టిన సంకల్ప యాత్ర గురువారం ఇల్లెందుకు చేరింది. ఈ సందర్భంగా స్థితప్రజ్ఞ మాట్లాడుతూ ఈ నెల 16న మొదలైన యాత్ర 33 జిల్లాల మీదుగా వచ్చే 12న హైదరాబాద్‌కు చేరుకుంటుందని తెలిపారు. ఉద్యోగుల స్నేహపూర్వక ప్రభుత్వంగా ప్రకటించుకున్నందున పాలకులు ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు టి. శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శ్రీకాంత్, నరేష్‌గౌడ్, రాజశేఖర్, నాగునాయక్, రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రైల్వేలైన్ కోసం భూమి అప్పగింత



రైల్వేలైన్ వెంట హద్దులు నిర్ధారిస్తున్న అధికారులు

మధిర: మూడో రైల్వే లైన్ ఏర్పాటు కోసం మధిరలో రెవెన్యూ, భూయజమానుల నుంచి సేకరించిన భూమిని గురువారం రైల్వే శాఖకు అప్పగించారు. మూడో లైన్ నిర్మాణానికి అవసరమైన ప్రాంతాల్లో భూయజమానుల నుంచి భూమిని రైల్వే శాఖ కొనుగోలు చేసింది. ఇందులో పలువురు పరిహారం కూడా తీసుకోగా, ఇంకొందరు కోర్టును ఆశ్రయించారు. ఈమేరకు 12, 15, 134, 146, 147, 150 సర్వే నంబర్లలోని భూమిని గురువారం కొలతలు వేసిన రెవెన్యూ అధికారులు రైల్వే శాఖకు అప్పగించారు. సర్వేలో రైల్వే ఏఈఈ వెంకటేశ్వరరావు, జేఈఈలు గోపాలకృష్ణ, పవన్, మధిర సర్వేయర్ ఉషారాణి, ఆర్ఐ జయకృష్ణ తదితరులు పాల్గొన్నారు.